క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలో శనివారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్‌పేట, పోర్టురోడ్డు, పాత రామన్నపేట, ముస్తాఖాన్‌పేట, ఉల్లింగిపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

కేడీసీసీబీ డైరెక్టర్‌గా రత్నారావు



గూడూరు: కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్‌గా గూడూరుకు చెందిన మోటేపల్లి రత్నారావును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం డైరెక్టర్‌గా కొనసాగుతున్న తలుపుల వెంకట కృష్ణారావు స్థానంలో మోటేపల్లి రత్నారావును నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా రత్నరావు నియామకంతో పాటుగా ప్రస్తుత కేడీసీసీ బ్యాంక్ పాలక వర్గం మరో ఆరు నెలల పాటు కొనసాగేలా గడువును ప్రభుత్వం పొడిగించింది.

కూడారై పాశుర మహోత్సవం



అవనిగడ్డ: స్థానిక గీతా మందిరంలో శుక్రవారం స్వామి వారికి కూడారై పాశుర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోదా రంగనాథులకు విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. 108 గంగాళాలతో నేతి ప్రసాదాలను భక్తులు సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

రెండు పుస్తకాలు ఆవిష్కరణ

అవనిగడ్డ: జల్లూరి రమాకుమారి రచించిన 'రమా కుమారీయం', 'నా జీవన రేఖలు' పుస్తకాలను మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. స్థానిక ఏ1 మార్టు హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దివిసీమ ఎందరో కవులు, కళాకారులకు పుట్టినిల్లని చెప్పారు. సాధారణ మహిళగా రమాకుమారి రెండు పుస్తకాలు రాయడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో రచయితలు గుడిసేవ విష్ణుప్రసాద్, సింహాద్రి పద్మ, దీవి రూన్సీ, ఎన్‌బీ కామేశ్వరి, చెన్నగిరి శ్రీనివాసరావు, సంకా స్వర్ణలత, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



చల్లపల్లి: పేదలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీపీ కోట విజయ రాధిక అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్టీ కాలనీలో చల్లపల్లి గ్రామ సచివాలయం-3 పరిధిలోని పేదల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు పర్యవేక్షణలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు రోగులు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ పత్రాల అందజేత

మచిలీపట్నంటౌన్: 31వ డివిజన్ శారదా నగర్‌లో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పత్రాలను కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. డివిజన్‌లోని లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పత్రాలను ఆయన అందజేశారు. పత్రాలను ఇంటికి తీసుకువచ్చి మరీ అందజేసిన కార్పొరేటర్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆస్తులపై పూర్తి హక్కు ఉండేలా ఓటీఎస్ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. దీనివల్ల లబ్ధిదారులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వివరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

మచిలీపట్నంటౌన్: 36వ డివిజన్‌లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ శుక్రవారం నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. సచివాలయం వద్ద సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కార్మికులకు నూతన వస్త్రాలను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు



బందరు బాల భవన్ ఇండోర్ కోర్టులో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు



చల్లపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ చిన రాట్నాలు

కోనేరుసెంటర్: జిల్లా కేంద్రంలోని బాల భవన్ ఇండోర్ కోర్టులో మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. నాకౌట్ విధానంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగంలో అరిసేపల్లి సచివాలయం జట్టు, మహిళల విభాగంలో బోగిరెడ్డిపల్లి సచివాలయం జట్టు విజేతగా నిలిచాయి. తొలుత మహిళల విభాగంలో నిర్వహించిన పోటీల్లో బోగిరెడ్డిపల్లి, కోన జట్లు చక్కని ఆటతీరును ప్రదర్శించి ఫైనల్ లోకి ప్రవేశించాయి. తుదిపోరులో బోగిరెడ్డిపల్లి జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి 21-16 స్కోరుతో కోన జట్టుపై విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీల్లోకి ప్రవేశించింది. అనంతరం జరిగిన పురుషుల పోటీల్లో అరిసేపల్లి సచివాలయం జట్టు ప్రతిభ చూపి ఫైనల్‌కి చేరుకుంది. ఫైనల్‌లో తాళ్లపాలెం-1, అరిసేపల్లి జట్లు తలపడగా అరిసేపల్లి జట్టు 21-13 స్కోరు తేడాతో తాళ్లపాలెం-1 జట్టుపై విజయం సాధించి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. విజేతలను ఎంపీడీఓ బాల కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

యువతలో ప్రతిభ వెలికితీసేందుకే..

మచిలీపట్నంటౌన్: యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం క్రికెట్ పోటీలను పేర్ని కిట్టు ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో యువత ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. వారికి సరైన ప్రోత్సాహం లేక ఎదుగుదల లేకుండా నిలిచిపోతున్నారని చెప్పారు. యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని ప్రయోజకులను చేసేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు దోహదపడతాయని చెప్పారు. పేర్ని కిట్టు కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో నాలుగు మ్యాచ్‌లు, ఆంధ్ర జాతీయ కళాశాల మైదానంలో నాలుగు మ్యాచ్‌లు, నాలుగు వాలీబాల్ మ్యాచ్‌లు, నాలుగు కబడ్డీ మ్యాచ్‌లు నిర్వహించారు. అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్ కుమార్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి..

చల్లపల్లి: యువత క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఎంపీపీ కోట విజయ రాధిక అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్‌లో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎంపీపీ పోటీలను ప్రారంభించి క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని నాలుగు గ్రామాల నుంచి వచ్చిన జట్లు తలపడ్డాయి. పోటీలను ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, ఈఓఆర్డీ అశోక్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, గ్రామ సచివాలయాల సిబ్బంది, పీఈటీలు పర్యవేక్షించారు.



బందరులో క్రికెట్ ఆడుతున్న జట్లు



బ్యాటింగ్ చేస్తున్న పేర్ని కిట్టు

ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించారు

వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము



మీడియాతో మాట్లాడుతున్న రాము

పెడన: ప్రజలకు మరింత సేవ చేసే అవకాశాన్ని వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. శుక్రవారం కొత్తూరు గ్రామంలోని స్వగృహంలో మీడియాతో ఆయన మాట్లాడారు. మా తండ్రి ఉప్పాల రాంప్రసాద్ పేదలకు సాయం చేయడంలో ముందుండేవారన్నారు. తండ్రి ఆశయాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో అందరిని కలిసి వారితో సంప్రదింపులు జరిపి, వారి సమస్యలతో పాటు నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబానికి చేసిన మేలును మరువలేనన్నారు. ఓసీ రిజర్వేషన్ స్థానంలో బీసీ మహిళ అయిన తన భార్య ఉప్పాల హారికకు ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సీటు ఇచ్చారని, ఇప్పుడు పెడన నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలను తన భుజస్కందాలపై ఉంచారని చెప్పారు. అందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రామును నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందించారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు



మాట్లాడుతున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. వైఎస్సార్ పింఛను కానుక పథకం ద్వారా నగరంలో నూతనంగా మంజూరైన 396 పింఛన్లను ఆయా లబ్ధిదారులకు నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ తన పాలన ప్రారంభం నుంచి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారన్నారు. ప్రతి కుటుంబానికి మేలులు జరుగుతున్నాయని భావిస్తేనే సీఎం జగన్‌ను మరోసారి దీవించాలని పేర్ని కిట్టు కోరారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పాలన కొనసాగేందుకు ప్రతిఒక్కరూ సీఎం జగన్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శవంతమైన పాలన సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, మేకల సుబ్బన్న, కాగిత జవహర్‌లాల్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంపునకు సహకరించండి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ రాజాబాబు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22న ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నామన్నారు. జిల్లాలో 1,763 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కలెక్టరేట్ ఆవరణలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, జిల్లాలో మరికొన్ని ప్రాంతాల్లో ఈ మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రాంతాలను గుర్తిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఈవీఎంల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని యువ ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ జరిగిన ప్రాంతాలను గుర్తించి కారణాలను తెలుసుకుని పోలింగ్‌శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, కొడమంచిలి చంద్రశేఖర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. సురేష్, డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ శ్యామ్‌నాథ్ పాల్గొన్నారు.

జూద క్రీడలకు దూరంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కలిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం

నాగాయలంక: సంక్రాంతి పర్వదినాల్లో సంప్రదాయం ముసుగులో కోడిపందేలు, పేకాట, గుండాట తదితర జూద క్రీడలు ఆడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. యువత పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఎస్పీ జాషువా ఆదేశాలు, అవనిగడ్డ పోలీస్ సబ్ డివిజన్ అధికారుల సూచనల మేరకు శుక్రవారం మండలంలో పలు చోట్ల ఆత్మీయ అవగాహన సమావేశాలు నిర్వహించారు. స్థానిక ట్రాఫిక్ ఐలండ్ కూడలిలో ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పండుగలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని చెప్పారు. జూద క్రీడలు ఆడితే జరిగే నష్టాలను వివరించారు. దీనిపై మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పోలీసులు ప్రచారం చేస్తున్నారని ఎస్ఐ చెప్పారు. ఏఎస్ఐ తుంగల ప్రసాద్ పాల్గొన్నారు.

● ఘంటసాల(అవనిగడ్డ): సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడలను మాత్రమే నిర్వహించాలని, అందుకు విరుద్ధంగా ఎవరన్నా జూద క్రీడలు నిర్వహించినా, ఆడినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఘంటసాల ఎస్ఐ కె. శ్రీనివాస్ హెచ్చరించారు. ఘంటసాలలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన జూద క్రీడల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కోడిపందేలు, పేకాట, గుండాటతో పాటు ఎలాంటి జూద క్రీడలకు అనుమతులు లేవని చెప్పారు.

యువతకు వివేకానంద జీవితం ఆదర్శం

నాగాయలంక: స్వామి వివేకానందుని జీవితం యువతకు ఆదర్శమని నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, దివి గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్ బ్రాంచి చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్, బండ్రెడ్డి హరి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని ఫుడ్ కోర్టు భవనంలో జాతీయ యువజన దినోత్సవం, వివేకానంద జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 62 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సింహాద్రి కృష్ణప్రసాద్ 44వ సారి, పర్చూరి చినబాబు (బందలాయిచెరువు) 56వ సారి, లేబాక కొండలు 24వ సారి రక్తదానం చేశారు. వీరిని అతిథులు సత్కరించారు. తొలుత వివేకానందుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అక్షయ ఫౌండేషన్ అధినేత మాదివాడ వెంకటకృష్ణ (క్రిస్టియన్), రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకరనాథ్, జిల్లా కోశాధికారి కొండపల్లి బాలాజీ, లేబాక నాగేశ్వరరావు, మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ పాల్గొన్నారు.

నలభై ఏళ్లకు మళ్లీ..



చల్లపల్లి: నలభై ఏళ్ల కిందట 170 మంది కలిసి చదువుకున్న మిత్రులంతా సంక్రాంతి సెలవుల సందర్భంగా తమ చిన్ననాటి చదువుల కోవెల ఒడికి చేరుకున్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాలలో 1980-83 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి, ఇంటర్ చదువుకున్న 170 మంది పూర్వ విద్యార్థులు, ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల 1982-83 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు శుక్రవారం సందడిగా జరిగాయి. సంక్రాంతి సందర్భంగా భోగి మంటలు, రంగవల్లికలు వేశారు. గాలిపటాలను ఎగురవేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కూర్చుని మురిసిపోయారు.

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్



అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం



బ్యానర్‌పై సంతకాలు చేస్తున్న విక్టర్‌ప్రసాద్. చిత్రంలో కలెక్టర్ రాజాబాబు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. జిల్లా స్థాయి సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడలిలోని విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డప్పు కళాకారుల ప్రదర్శన, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. ఫ్లెక్సీ బ్యానర్‌పై సంతకాలు చేశారు. కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. సభావేదికపై గరికపర్రు డప్పు కళాకారులు, చల్లపల్లి సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, రుద్రవరం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎంతో మంది ప్రజలు వస్తున్నారన్నారు. కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ జ్ఞానానికి ప్రతీకగా నిలిచారన్నారు. జ్ఞానమంటే ఒక మనిషిని చీకటి నుంచి వెలుగులోకి నడిపించే శక్తి అని చెప్పారు. దళితులు అనే పదానికి అర్థం కేవలం ఎస్సీ, ఎస్టీలే కాదని, అణచివేతకు గురైన ప్రతి ఒక్కరూ అందులోకే వస్తారన్నారు. ఏ దేశంలో అయితే అందరికీ సమానమైన అవకాశాలు ఉంటాయో ఆ దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, జెడ్పీ సీఈఓ వి. జ్యోతిబసు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు, ఆర్డీఓ ఎం. వాణి, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, ఎస్సీ సంఘాల నాయకులు కుంపటి జయకర్, బూరగ రామారావు, అరిసె శ్రీహరి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాంట్రాక్టర్ల సంఘ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సర్కా) ప్రతినిధులు కలెక్టర్ పి. రాజాబాబును శుక్రవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ 2024 డైరీని కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు వివిధ శాఖల్లో చేసిన పనులకు త్వరితగతిన బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వారు కోరారు. కార్యక్రమంలో సీహెచ్ రవిబాబు, టీజే నాగకృష్ణ, ఎల్. రవికిరణ్, ఎంఎస్‌డీ శ్రీనివాసరావు, బి. ప్రభునాథ్ ప్రసాద్, సీహెచ్ తిమ్మరాజు పాల్గొన్నారు.


ఘనంగా సంక్రాంతి సంబరాలు



పెడన: సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు, జాతీయ యువజన దినోత్సవం జరిగాయి. విజయవాడ రామకృష్ణ పీఠానికి చెందిన స్వామీజీ యజ్ఞపురుషానంద మాట్లాడుతూ స్వామి వివేకానందను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. అనంతరం సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని భోగిమంటలు వేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, రంగవల్లుల పోటీలు జరిగాయి. విద్యార్థులు అధ్యాపకులు గాలి పటాలను ఎగురవేసి ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కుమార్‌బాబు, డైరెక్టర్లు బాబా, ప్రిన్సిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన డ్యాన్స్ పోటీలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో సుమారు వందమంది వరకు పాల్గొన్నారు. ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్‌బాషా, కాగిత సాంబశివరావు, అజయ్, కౌన్సిలర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



మచిలీపట్నంటౌన్: బలరామునిపేట యతిరాజ భవనంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం 27వ రోజు పూజల్లో భాగంగా శుక్రవారం కూడారై 108 గంగళాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీకర్ ఆచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను, పాయసాన్ని అందించారు. స్వామి వారి లీలలు, పాశురాల వైశిష్ట్యాన్ని భక్తులకు వివరించారు.

పైడమ్మ అమ్మవారి అన్నసమారాధన

పెడన: పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ముగిసిన సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరు కౌంటర్ల ద్వారా భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. తొలుత ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ఆసాది లీలాకృష్ణప్రసాద్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌బాబు, బల్ల పద్మావతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.